సాక్షి జగిత్యాల

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024

'జుడా'కు జీవో జారీ



జగిత్యాల: పట్టణ ప్రాంతాల్లో ఇదివరకే రూపుదిద్దుకున్న పట్టణాభివృద్ధి సంస్థ తరహాలో జిల్లా యూనిట్‌గా తీసుకుని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో జిల్లాలోని 294 గ్రామాలను యూనిట్‌గా తీసుకున్నారు. గతంలో జగిత్యాల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (జుడా)కు ప్రణాళిక సిద్ధం చేసినా.. ప్రస్తుతం అన్ని మున్సిపాలిటీలు, 294 గ్రామపంచాయితీలను కలిపారు. ఇవన్నీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి కిందకు రానున్నాయి.

న్యూస్‌రీల్

అడిషనల్ కలెక్టర్‌గా బీఎస్.లత



జగిత్యాల: అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా బీఎస్. లత నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రాంబాబు బదిలీపై సూర్యపేట వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న లతను ఇక్కడకు బదిలీ చేశారు. లత జిల్లాలో దాదాపు రెండేళ్లు పనిచేశారు.

కోరుట్ల ఆర్డీవోగా జివాకర్



కోరుట్ల: కోరుట్ల ఆర్డీవోగా జివాకర్‌రెడ్డిని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గతంలో ఉట్నూరు ఆర్డీవోగా పనిచేశారు. దీపావళి అనంతరం జివాకర్ బాధ్యతలు స్వీకరించనున్నట్టు సమాచారం.

అటవీప్రాంతాన్ని పరిశీలించిన ఎఫ్ఆర్‌వో



భూములు పరిశీలిస్తున్న ఎఫ్ఆర్‌వో, రైతులు

కథలాపూర్: మండలంలోని దుంపేట శివారులో అటవీప్రాంతాన్ని మెట్‌పల్లి ఎఫ్ఆర్‌వో పద్మారావు సోమవారం పరిశీలించారు. అటవీశాఖ భూమిని కొందరు చదును చేశారని ఫిర్యాదులు వచ్చిన విషయం తెల్సిందే. చదును చేసిన భూమి రెవెన్యూ పరిధిలోకి వస్తుందా..? అటవీశాఖ పరిధిలోకి వస్తుందా..? అని రెండుశాఖల సర్వేయర్‌లతో సర్వే చేయిస్తామని అధికారులు పేర్కొన్నారు. అప్పటివరకు భూములను చదును చేయొద్దని గ్రామస్తులకు సూచించారు. ఆయన వెంట బీట్ ఆఫీసర్ శివ, సర్వేయర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రమేశ్, రైతులు ఉన్నారు.

మార్కెట్‌యార్డుకు ఐదు రోజుల సెలవులు

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్‌యార్డుకు ఐదు రోజుల సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఈనెల 30 నుంచి నవంబర్ 3 వరకు యార్డులో క్రయవిక్రయాలు నిలిపివేసినట్లు పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

నేడు ఎంఈవోలకు హైదరాబాద్‌లో శిక్షణ

కథలాపూర్: పాఠశాలల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎంఈవోలకు ప్రభుత్వం హైదరాబాద్‌లో మంగళవారం ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. శిక్షణకు హాజరుకావాలని హాజరుకావాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి జిల్లాలోని ఎంఈవోలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లాలో 20 మంది ఎంఈవోలు పనిచేస్తున్నారు. వీరికి పాఠశాలల పర్యవేక్షణ, విద్యాప్రమాణాల పెంపు, పరిపాలన విధానం తదితర అంశాలపై ఒక్కరోజు శిక్షణ ఉంటుందని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

మున్నూరుకాపులు ఐకమత్యంగా ఉండాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

జగిత్యాల: మున్నూరుకాపులు ఐకమత్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సంఘం జిల్లా అధ్యక్షుడు చెదల సత్యనారాయణ అన్నారు. సోమవారం సంఘం గౌరవ అధ్యక్షుడు రాజేందర్ స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. కాపులు సమాజానికి ఆదర్శంగా ఉంటూ సేవ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే కులగణనలో విధిగా పాల్గొని తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేవీఆర్.పటేల్, రవికుమార్, మల్లారెడ్డి, రచన, పాపన్న, రాజేశం పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

మెట్‌పల్లి: హక్కుల సాధనకు బీసీ, ఎస్సీ, ఎస్టీలు సమష్టిగా ఉద్యమించాలని లంబాడి హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు దాస్ రాంనాయక్ అన్నారు. పట్టణంలో బామ్‌సేఫ్ ఆధ్వర్యంలో సోమవారం సదస్సు నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీ కుల గణన చేపట్టకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందన్నారు. బీఎంఎస్ అధ్యక్షుడు దయ్య రఘువీర్, దయ్య రాజారాం, తుల రాజేందర్, కోటగిరి వెంకటస్వామి, నాగ నిర్మల, సోమిడి శ్యామ్ తదితరులున్నారు.

ఖాకీలకే వసూల్ రాజా!



- బయటి వసూళ్లతోపాటు డిపార్ట్‌మెంట్‌లోనూ..
- కానిస్టేబుల్ నుంచి సీఐ ర్యాంకు వరకు కప్పం కట్టాల్సిందే
- డబ్బులిస్తే కేసులున్నా, వివాదాస్పదులైనా.. పోస్టింగులు
- వసూళ్ల కోసం ఓ కానిస్టేబుల్ నియామకం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా పోలీసు ఉన్నతాధికారి నిర్వాకం
- ఇంటెలిజెన్స్ రిపోర్టుతో బదిలీకి రంగం సిద్ధం

సాక్షి ఎక్స్‌క్లూజివ్

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఓ పోలీసు ఉన్నతాధికారి వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అత్యంత అవినీతిపరుడిగా పేరొందిన ఆ ఉన్నతాధికారి ఆగడాలను తట్టుకోలేక డిపార్ట్‌మెంట్‌లో కిందిస్థాయి అధికారులు నలిగిపోతుండగా.. డిపార్ట్‌మెంటుకు మచ్చ తెస్తున్న ఆయన తీరుపై పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. సాధారణంగా కొందరు పోలీసులు ఇతరులవద్ద డబ్బులు వసూలు చేసిన ఘటనలు చూస్తుంటాం. కానీ.. ఆయన సొంత డిపార్ట్‌మెంట్ వారి వద్ద కూడా వసూలు చేసుకుంటూ సాగుతున్నాడు. ఆయన అక్రమాలపై ఇప్పటికే ఇంటెలిజెన్స్ రిపోర్టు ఇచ్చిన నేపథ్యంలో ఆయన బదిలీ తథ్యమనే ప్రచారం జోరందుకుంది.

జనవరిలోనే దందా మొదలు..

వాస్తవానికి అయ్యవారి లీలలు గత జనవరిలోనే వెలుగుచూశాయి. అప్పట్లో మైనింగ్ వాళ్ల నుంచి దాదాపు రూ.30 లక్షలు వసూలు చేసినట్లు ఇంటెలిజెన్స్ వాళ్లు గుర్తించారు. అప్పటి నుంచి ఇక వెనుదిరిగి చూడలేదు. అప్పుడు ఉన్నతాధికారులు ఏమీ అనలేదనో.. లేక రాజకీయంగా కొందరి అండ దొరికిందని అనుకున్నాడో కానీ.. డిపార్ట్‌మెంట్‌లో వసూళ్ల వేగం పెంచాడు. ఇతని ఏరియాలో ఉన్న మైనింగ్, క్వారీ, ఇటుకబట్టీలు తదితరాల నుంచి వసూళ్లను దండుకుంటున్నాడు. గుట్కాతో పాటు అన్ని రకాల అక్రమ వ్యాపారులతో మిలాఖత్ అయ్యాడు. వసూళ్ల కోసం తనకు అనుకూలంగా ఉన్న ఓ కానిస్టేబుల్‌ను నియమించుకున్నాడు. ప్రతీ వసూళ్లలో అతనికి 10 శాతం వాటా ఇస్తాడు. ఒకటి రెండు కేసుల్లో నిందితులను అనుకూలంగా మలుచుకున్నారన్న ప్రచారం కూడా ఉంది.

ఎస్‌హెచ్‌వో కావాలంటే రూ.2 లక్షలివ్వాలి

ఈ అధికారి వద్ద ఎస్సై నుంచి సీఐ వరకు ఎస్‌హెచ్‌వోగా చేరాలంటే తొలుత రూ.2 లక్షలు చెల్లించాలి. ఆపై ప్రతీ నెల సీఐ రూ.50వేలు, ఎస్సై రూ.40 వేలు ప్రతీ నెలా కప్పం కట్టి 'రెన్యువల్' చేయించుకోవాలి. లేకపోతే వారి పనిలో లోపాలు చూపి వేధించి, వారే వెళ్లిపోయేలా చేస్తాడు. అదే సమయంలో డిపార్ట్‌మెంట్‌లో కేసులు నమోదై అవినీతి, మిస్‌కండక్ట్ ఆరోపణలు ఎదుర్కొంటూ లూప్‌లైన్‌లో ఉన్న వారంతా ఇతన్ని ఆశ్రయిస్తున్నారు. వారి వద్ద డబ్బులు తీసుకుని ఆయన పోస్టింగులు ఇస్తున్నాడు. ఇటీవల జరిగిన కానిస్టేబుల్ బదిలీల్లోనూ తలా రూ.10 వేల చొప్పున రూ.లక్షలు వసూలు చేశాడని డిపార్ట్‌మెంట్ కోడై కూస్తోంది. ఇటీవల ఓ కానిస్టేబుల్ అక్రమాలు పెరిగిగాయని అతని పైఅధికారి బదిలీ వేటేశాడు. కానీ..అయ్యవారు సదరు కానిస్టేబుల్‌కి పాత స్థానంలో పోస్టింగ్ ఇచ్చి తన 'పెద్ద' మనసు చాటుకున్నాడు.

కీలక నేత వద్ద భంగపాటు

సదరు అధికారిపై అవినీతి ఆరోపణలు రోజురోజుకు మితిమీరిపోయాయి. అయితే, ఇంటెలిజెన్స్ తన ఆగడాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తుందన్న విషయాన్ని సదరు అధికారి ఆలస్యంగా గుర్తించాడు. రేపోమాపో బదిలీ వేటు పడబోతుందని ముందే తెలుసుకున్నాడు. వెంటనే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ సీనియర్ నేతను ఆశ్రయించాడు. అయితే, సదరు అధికారి అక్రమాలపై అప్పటికే ఆగ్రహంతో ఉన్న ఆయన ఎలాంటి హామీ ఇవ్వలేదని సమాచారం. ఇతని ఆగడాలపై విసిగి వేసారిన పలువురు పోలీసు అధికారులే స్వయంగా మంత్రులను కలిసి ఫిర్యాదులు చేస్తుండటంతో ఇతనిపై వేటు తప్పదన్న ప్రచారం జరుగుతోంది.

ఎంఈడీ కౌన్సెలింగ్‌కు బీఈడీ అభ్యర్థులు దూరం

- నేడు బీఈడీ ఫలితాలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: శాతవాహనయూనివర్సిటీ పరిధిలో బీఈడీ నాలుగో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు వింత సమస్య ఎదురైంది. వీరంతా ఇటీవల ఎంఈడీ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు సాధించారు. ఎంఈడీ కౌన్సెలింగ్ కోసం ఈనెల 28 నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వీలుంది. అయితే బీఈడీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలు వెలువడలేదు. దీంతో ఎంఈడీ కౌన్సెలింగ్‌లో వారు బీఈడీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయలేకపోతున్నారు. ఫలితంగా ఎంఈడీలో ర్యాంకు వచ్చినప్పటికీ దరఖాస్తు చేసుకోలేని దుస్థితి నెలకొంది. శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని దాదాపు 800 మంది బీఈడీ అభ్యర్థులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. యూనివర్సిటీ అధికారులు వెంటనే ఫలితాలు వెల్లడించి తాము ఎంఈడీ కౌన్సెలింగ్‌లో పాల్గొనేలా సహాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' యూనివర్సిటీ కంట్రోలర్ డాక్టర్ శ్రీరంగప్రసాద్ దృష్టికి తీసుకెళ్లింది. దీనికి ఆయన స్పందిస్తూ ఫలితాలు ఆలస్యమైన మాట వాస్తవమేనని అంగీకరించారు. విద్యార్థులు ఎవరూ నష్టపోకుండా ఎంఈడీ కౌన్సెలింగ్‌కు హాజరయ్యేలా మంగళవారం (29న) ఫలితాలు వెల్లడించేందుకు ప్రయత్నిస్తామని ఆయన వివరించారు.

గంగారెడ్డి హత్యపై పూర్తిస్థాయిలో విచారణ

- డీజీపీతో స్వయంగా మాట్లాడాం
- గంగారెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం
- రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



గంగారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

జగిత్యాలరూరల్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, జాబితాపూర్ మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి హత్యపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం రాత్రి జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలోని గంగారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి పరామర్శించారు. గంగారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందన్నారు. కుటుంబ సభ్యులు వ్యక్తం చేస్తున్న అనుమానాలపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తామన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, తాను డీజీపీతో మాట్లాడామన్నారు. హత్య వెనుక ఎవరున్నా వారిపై చర్యలు తప్పవన్నారు. పోలీసులకు నిందితునితో ఉన్న సంబంధాలపై దర్యాప్తు చేస్తామన్నారు. జీవన్‌రెడ్డి పార్టీలో సీనియర్ అని, ఆయన సేవలు పార్టీకి అవసరమని, ఆయ సేవలను వినియోగించుకుంటామన్నారు. రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్, నాయకులు జున్ను రాజేందర్, గాజంగి నందయ్య, కొత్త మోహన్, గర్వందుల నరేశ్‌గౌడ్, నిషాంత్‌రెడ్డి, తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, తాటిపర్తి రాంచందర్‌రెడ్డి, బాలకృష్ణరెడ్డి పాల్గొన్నారు.

రేవ్‌పార్టీ కాదు.. రేవంత్ పార్టీ కుట్ర..



మాట్లాడుతున్న విద్యాసాగర్‌రావు, చిత్రంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

జగిత్యాల: కేటీఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఇంటిపై సోదాల పేరిట పోలీసులు దాడిచేశారని, అది రేవ్‌పార్టీ కాదని, రేవంత్ పార్టీ కుట్ర అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు అన్నారు. సోమవారం ఆయన జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పాలన చేతకాక రోజుకో అరాచకం చేస్తున్నారని, ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నారని విమర్శించారు. హైడ్రా, మూసీ సుందరీకరణ, బెటాలియన్ కానిస్టేబుల్ వ్యవహారం, నిరుద్యోగులు, రైతుల రుణమాఫీ వంటి విషయాల్లో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. కేటీఆర్‌కు వస్తున్న ప్రజాదరణ చూడలేక కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఎం హుందాగా ఉండాలని, కానీ.. కేసీఆర్‌ను తిట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నట్లు కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను చూస్తే తెలిసిపోతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ సమస్యలపై ప్రజల దృష్టి మళ్లించేలా సీఎం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో మహిళలను అవమానించే సంస్కృతి రేవంత్‌రెడ్డికే దక్కిందని మాజీ జెడ్పీచైర్‌పర్సన్ అన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రియాంక, గట్టు సతీశ్, ఆనందరావు, మల్లేశం పాల్గొన్నారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి



ధర్నాలో మధ్యాహ్న భోజన, జీపీ కార్మికులు

జగిత్యాలటౌన్: గ్రామ పంచాయతీ, మధ్యాహ్న భోజన కార్మికుల వేతన బకాయిలు విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఒకే వ్యక్తి అన్ని పనులు చేసే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వ స్పందన కరువైందన్నారు. గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పులి మల్లేశం, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగమ్మ, వెంకటాచారి పాల్గొన్నారు.

కొనుగోళ్లు పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న డీసీవో మనోజ్‌కుమార్

మల్లాపూర్: ధాన్యం కొనుగోళ్లు పక్కాగా నిర్వహించాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముత్యంపేట సహకార సంఘం కార్యాలయంలో అవగాహన కల్పించారు. రైతులు ధాన్యం తేగానే సీరియల్ నంబర్లు అందించాలన్నారు. డీసీసీబీ జిల్లా డైరెక్టర్ తక్కళ్ల నరేశ్‌రెడ్డి, క్లస్టర్ సీనియర్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ.నిజాముద్దీన్, కలీం, ప్యాక్స్ సీఈవో రమేశ్, మల్లాపూర్, మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలాల కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జీలు, ట్యాబ్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు

- సీఆర్ఆర్ గ్రాంట్ నుంచి రూ. 15 కోట్లు
- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అడ్లూరి

పెగడపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కీచులాటపల్లిలో అభివృద్ధి చేయనున్న రోడ్డును పరిశీలించారు. నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణానికి సీఆర్‌సీఆర్ గ్రాంట్ నుంచి రూ.15 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కీచులాటపల్లి నుంచి ధర్మారం మండలం మల్లాపూర్ వరకు రూ. 8.26 కోట్లు, ఏడుమోటలపల్లి నుంచి పెగడపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లిలో హన్మాన్ ఆలయం నుంచి కొత్తపల్లి జీపీ కార్యాలయం వరకు రూ.1.30 కోట్లు, ఖిలావనపర్తికి రూ. 1.20 కోట్లు, ఎండపల్లి మండలం సూరారం నుంచి గోపాల్‌రావుపేట వరకు రూ.2 కోట్లు, సూరారంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. పీఆర్ డీఈ అశ్విన్, ఏఈ షంశేర్ అలీ, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ధాన్యంలో కోత విధించొద్దు

ధాన్యం సేకరణలో మిల్లర్లు, కేంద్రాల నిర్వాహకులు కోత విధించొద్దని విప్ అన్నారు. బతికపల్లి, రాములపల్లిలో ఐకేపీ, నంచర్లలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నాణ్యమైన ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. విండో చైర్మన్ వేణుగోపాల్, ఆర్ఐ జమున, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

గొల్లపల్లి, వెల్గటూర్‌లో..

గొల్లపల్లి/వెల్గటూర్: గొల్లపెల్లి మండలం శంకర్రావుపేట్, వెంగళాపూర్‌లో, ఎండపల్లి మండలకేంద్రంతోపాటు కొండాపూర్‌లో కేంద్రాలను ప్రారంభించారు. కాంగ్రెస్ ఎండపల్లి మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుండాటి గోపిక, వైస్ చైర్మన్ గోళ్ల తిరుపతి పాల్గొన్నారు.

కొడుకు పోషించడం లేదని ఆర్డీవోకు ఫిర్యాదు



ఫిర్యాదు అందిస్తున్న బాధితుడు దుంపటి

జగిత్యాల: కొడుకు పోషించడం లేదని, పైగా వేధింపులకు గురిచేస్తున్నాడని మల్యాల మండలం రామన్నపేటకు చెందిన పంజాల దుంపటి అనే వృద్ధుడు జగిత్యాల ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు. తనను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. పోషణ నిమిత్తం ఆర్నెళ్లకు రూ.50 వేలు ఇవ్వాలని తీర్మానం చేసినా.. ఇవ్వడం లేదని వాపోయారు. న్యాయం చేయాలని సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ద్వారా ఆర్డీవోకు ఫిర్యాదు చేశాడు.

ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గురువారెడ్డి



జగిత్యాల: ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గురువారెడ్డి ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన గురువారెడ్డి తెలంగాణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోన్-2 ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సత్యప్రసాద్
- వెంటనే పరిశీలించాలని అధికారులకు ఆదేశం

జగిత్యాలటౌన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లానలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. వారి నుంచి కలెక్టర్ సత్యప్రసాద్ అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 31 దరఖాస్తులు రాగా.. పరిశీలించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, గౌతంరెడ్డి, జగిత్యాల, మెట్‌పల్లి ఆర్డీవోలు పులి మధుసూదన్‌గౌడ్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, ఇతర అధికారులు

భూ మార్పిడి రద్దు చేయండి



మెట్‌పల్లి మండలం బండాలింగాపూర్ శివారు సర్వే నంబర్లు 1791, 1786లో గీత పారిశ్రామిక సంఘం తరఫున కొనుగోలు చేసిన 4.20 ఎకరాల్లో ఈత, తాటివనం పెంచుకుని కల్లుగీస్తూ ఉపాధి పొందుతున్నాం. సత్తక్కపల్లి గ్రామానికి చెందిన కొందరు ఇటీవల రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మా సంఘానికి చెందిన మూడెకరాలను పహాణీలో మార్చుకుని ధరణిలో వారి పేరిట నమోదు చేసుకున్నారు. ధరణిలో అక్రమంగా జరిగిన భూ మార్పిడిని రద్దు పరిచి గౌడ సంఘం పేరిట తిరిగి పట్టా జారీచేసి న్యాయం చేయండి.

– బండలింగాపూర్ గౌడ కులస్తులు

యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



హన్మకొండ హెడ్డాఫీసుగా నిర్వహిస్తున్న అక్షర చిట్‌ఫండ్ శాఖను జగిత్యాలలో ఏర్పాటు చేశారు. నిర్వాహకులు మాతో చిట్టీలు వేయించారు. చిట్ కాలపరిమితి ముగిసినప్పటికీ డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్నారు. చిట్‌ఫండ్ చైర్మన్ పేరాల శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు పేరాల శ్రీవిద్య, పుప్పాల రాజేందర్, జగిత్యాల బ్రాంచి మేనేజర్ వంగల తిరుపతి, సిబ్బందిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని మా చిట్ సొమ్ము తిరిగి ఇప్పించండి.

– అక్షర చిట్‌ఫండ్ బాధితులు

ధాన్యానికి రశీదు ఇవ్వాలి



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం పూర్తయిన వెంటనే రశీదు (తక్‌పట్టి) ఇవ్వాలి. జిల్లాలో 167 రైసు మిల్లులు మాత్రమే ఉండటంతో తాలు, తప్ప పేరుతో తూకంలో కోత విధిస్తున్నారు. పొరుగు జిల్లాల్లోని మిల్లులకు ధాన్యం కేటాయిస్తే పోటీ పెరిగి దోపిడీ తగ్గే అవకాశం ఉంది. ధాన్యం తూకం వేశాక మిల్లర్లకు సంబంధం లేకుండా చూడాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు దొడ్డు, సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500బోనస్ వర్తింపచేయాలి.

– రైతు ఐక్య వేదిక నాయకులు

మద్యం ధరలు అదుపు చేయండి



బుగ్గారం మండలం గోపులాపూర్ వైన్స్‌షాపులో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. ఆ వైన్స్ షాపును సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలి. శ్రీలక్ష్మీనరసింహ వైన్స్‌లో ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. క్వార్టర్‌కు రూ.20, బీరుకు రూ.20, హాఫ్‌బాటిల్‌కు రూ.40, ఫుల్లు బాటిల్‌కు రూ.80 చొప్పున అధికంగా విక్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే ఎక్కువ వసూలు చేస్తున్న వైన్స్‌షాపు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి.

– బుగ్గారం గ్రామస్తులు

గంజ్‌నాలాలో వ్యర్థాలు తొలగించండి



జిల్లాకేంద్రంలోని గంజ్ నాలాలో వ్యర్థాలు తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు, పందులకు ఆవాసంగా మారింది. ఇంట్లో ఉండలేకపోతున్నాం. బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసినా వ్యర్థాలు తొలగించడం లేదు. రోగాల బారిన పడుతున్నాం. గంజ్ నాలాను శుభ్రం చేయించండి.

– సయ్యద్ షాజి, జగిత్యాల

క్లుప్తంగా

వైద్యుడి మృతదేహం లభ్యం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం విట్టంపేట వద్ద వరదకాలువలో ఆదివారం గల్లంతైన వైద్యుడు శవమై తేలాడు. మెట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న హన్మకొండకు చెందిన పాకంటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి (29) ఈతకు వెళ్లి గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం వేకువజాము విట్టంపేటకు కొద్దిదూరంలో వరదకాల్వలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకుని బయటకు తీయించారు. ఉదయ్‌కిరణ్ మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు బోరున విలపించారు.

అరకిలో గంజాయి పట్టివేత

ధర్మపురి: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పట్టుకున్నామని, వారి నుంచి అరకిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఎస్సై మహేశ్ తెలిపారు. మండలంలోని మగ్గిడి గ్రామానికి చెందిన సల్లూరి నరేశ్, మంచిర్యాల జిల్లా జన్నారానికి చెందిన జున్నోజు రాజేశ్ సోమవారం ధర్మపురిలోని పటేల్ గార్డెన్ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రాగా.. ఎస్సై తన సిబ్బందితో అక్కడకు చేరుకుని నరేశ్, రాజేశ్‌ను అరెస్టు చేశారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

రుద్రంగి(వేములవాడ): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. రుద్రంగి ఎస్సై అశోక్‌కు వచ్చిన సమాచారం మేరకు రుద్రంగిలోని గంగమ్మ కమాన్ ఆవరణలో సోమవారం ఆటోలో గంజాయిని తీసుకొస్తున్న జడల నాగరాజు, తోట జగన్‌లను అరెస్ట్ చేసి, వారి నుంచి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. రుద్రంగి ఎస్సై సిరిసిల్ల అశోక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

జమ్మికుంట: జమ్మికుంట పోలీసుస్టేషన్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదైంది. ఓ బాలికను లైంగికంగా వేధించినందుకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వి.రవి సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పట్టణంలోని కొత్తపల్లిలో నివాసం ఉండే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సమీపంలో నివాసముండే బాలికను జామకాయలు ఇస్తానని ఇంట్లోకి పిలిచాడు. చేతులు పట్టుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. బాలిక ఏడుస్తూ బయటికొచ్చింది. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసుకు ఫిర్యాదు చేయగా.. పోక్సో కేసు నమోదు చేశారు.

డిజిట్ల గల్లంతుపై విచారణ

రామగిరి(మంథని): బేగంపేట పోస్టాఫీస్‌లో డిపాజిట్‌ల గల్లంతుపై తపాలా శాఖ అధికారులు సోమవారం విచారణ నిర్వహించారు. అక్కడి బీపీఎం నకిలీ పాస్ పుస్తకాలు సృష్టించి డబ్బు స్వాహా చేశారని ఘటనలపై పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు మోహన్, శ్రీనాథ్‌రెడ్డి ఆరా తీశారు. పాసుపుస్తకాలు, రశీదులను పరిశీలించగా కొన్ని నకిలీవని తేలాయి. పెద్ద మొత్తంలో నిధులు స్వాహా కావడంతో ఉన్నతాధికారుల పాత్ర ఏమైనా ఉందా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆర్నెల్ల క్రితం సెంటనరీకాలనీ పోస్టాఫీస్‌లో ఎస్‌పీఎం సుమారు రూ.60 లక్షలు మాయమైన ఘటనపై అధికారులు అప్పుడే అప్రమత్తంగా ఉంటే ఈ సంఘటన జరిగేది కాదని అంటున్నారు.

బస్టాండ్ నుంచి బైక్‌లు మాయం

జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇటీవల తన బైక్‌ను బస్టాండ్‌లో పార్క్ చేసి కోరుట్లకు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో లబోదిబోమంటూ వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. సదరు పోలీసులు కేసు నమోదు చేశారు.

20 రోజుల క్రితం.. రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కూతురు హైదరాబాద్ నుంచి రాగా తీసుకెళ్లేందుకు బస్టాండ్‌కు బైక్‌పై వచ్చాడు. బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ చేసి తన కూతురును తీసుకొచ్చే లోపే దొంగలు ఆయన వాహనాన్ని ఎత్తుకెళ్లారు.

ఈనెల 22న.. జిల్లాకేంద్రంలోని గంజ్‌రోడ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి కొత్తబస్టాండ్‌లో తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేసి కోరుట్లకు వెళ్లి వచ్చేసరికి గుర్తుతెలియని దొంగలు వాహనాన్ని ఎత్తుకెళ్లారు.

- నెల రోజుల్లో ఆరు వాహనాల చోరీ
- క్షణాల్లోనే మాయం చేస్తున్న దుండగులు


కొత్తబస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని కొత్తబస్టాండ్‌లోని పార్కింగ్ జోన్‌లో పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తుతెలియని దొంగలు రోజుకో వాహనాన్ని చోరీ చేస్తున్నారు. పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో దొంగల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారిని తీసుకెళ్లేందుకు వస్తున్న వారు బస్టాండ్ ప్రాంతంలో పార్కింగ్ చేసి కొద్దిసేపట్లోనే వాహనాలు కనిపించడం లేదు. దీంతో బస్టాండ్‌లో వాహనాలను పార్కింగ్ చేయాలంటేనే ప్రజలు జంకుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో బస్టాండ్ ఆవరణలో పోలీసులు విచారణ చేపడుతున్నా.. ఎక్కడా సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను గుర్తించలేపోతున్నారు. బస్సులు బస్టాండ్‌లోకి వచ్చే దారిలో.. అలాగే బయటకు వెళ్లే దారిలో కూడా సీసీ కెమెరాలు లేకపోవడం దొంగలకు కలిసివస్తోంది. అదును చూసి బైక్‌లను అక్కడి నుంచి ఎత్తుకెళ్తున్నారు.

నిఘా కరువు..

జగిత్యాల కొత్తబస్టాండ్‌లో పార్కింగ్ చేసిన వాహనాలు చోరీకి గురవుతున్నా నిఘా పెట్టేవారే కరువయ్యారు. దొంగతనాల బెడద ఎక్కువ కావడంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వాహనాలను దొంగిలించిన వ్యక్తిని ఇటీవలే పట్టుకున్నారు. కేవలం నాలుగు ద్విచక్ర వాహనాలను మాత్రమే స్వాధీనం చేసుకున్నారు. మిగతా వాహనాలను ఎత్తుకెళ్లిన దొంగలు దొరకాల్సి ఉంది.

విలేజ్ పోలీస్ ఆఫీసర్ తప్పనిసరి

- పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్ట పరచాలి
- ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడి
- ఉత్తమ పోలీసులకు ప్రశంసపత్రాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: గ్రామాల్లో వీపీవో (విలేజ్ పోలీస్ ఆఫీసర్) వ్యవస్థ తప్పనిసరి అని, పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జిల్లాలో జరుగుతున్న నేరాలపై పోలీస్ అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేర విచారణ సమర్థవంతంగా చేపట్టాలని, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నాన్ గ్రేవ్, గ్రేవ్ కేసుల్లో తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. దొంగతనాల నివారణకు సర్కిల్ పరిధిలో స్పెషల్ టీంను నియమించాలన్నారు. ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు. రౌడీ, హిస్టరీ షీట్స్ ఉన్నవారిపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసపత్రాలు

విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు. అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వరరావు, డీసీఆర్బీ, సీసీఎస్, ఐటీ కోర్ సీఐలు శ్రీనివాస్, రఫీక్‌ఖాన్, సీఐలు వేణుగోపాల్, రాంనరసింహారెడ్డి, రవి, నిరంజన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

వర్టికల్‌లో ప్రతిభ కనబర్చిన మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ నీలినాయక్, కథలాపూర్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పురుషోత్తంకు ఎస్పీ అశోక్‌కుమార్ ప్రశంసపత్రాలు అందించి అభినందించారు.

ఎస్‌బీఐ రివార్డుల పేరిట వాట్సప్‌కు లింకులు



వాట్సప్ గ్రూప్‌లో వచ్చినసందేశం

హుజూరాబాద్‌రూరల్: సైబర్ కేటుగాళ్లు రోజురోజుకూ కొత్తకొత్త మోసాలకు పాల్పడుతున్నారు. హుజూరాబాద్ పట్టణంలోని వివిధ బ్యాంకుల వినియోగదారులకు సోమవారం ఉదయం వాట్సప్ గ్రూపుల్లో ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి రివార్డులు వచ్చాయని, అవి క్యాష్‌గా మార్చుకోవాలంటే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటూ సందేశాలు వచ్చాయి. రూ.10,599 రివార్డు పాయింట్లు వచ్చాయని, 28వ తేదీ చివరి రోజంటూ, యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రివార్డు పాయింట్లను క్యాష్‌రూపంలో మార్చుకోవచ్చంటూ సందేశాలు వచ్చాయి. పట్టణానికి చెందిన రమేశ్ అనే ప్రైవేట్ ఉద్యోగి తనకు వచ్చిన లింకును ఓపెన్ చేయగా వాట్సప్ హ్యాక్ అయింది. వెంటనే ఎస్‌బీఐ బ్యాంక్‌కు వెళ్లి తనకు వచ్చిన సందేశాన్ని, లింకును చూపించాడు. ఈ విషయమై చర్యలు తీసుకోవాలని బ్యాంక్ అధికారులను లిఖితపూర్వంగా కోరాడు. బ్యాంకు నుంచి ఎలాంటి రివార్డు పాయింట్లు రాలేదని, కష్టమర్లు అప్రమత్తంగా ఉండాలని బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు.

ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కిషన్


డాక్టర్ పి.కిషన్

కరీంనగర్ టౌన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) 2024–25 సంవత్సరానికిగాను రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్ చెందిన సీనియర్ సైకియాట్రిస్ట్ పి.కిషన్ ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్ కోఠి ఐఎంఏ హాల్లో జరిగిన ఎన్నికలలో కిషన్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కరీంనగర్‌కు చెందిన డాక్టర్ ఎంఎల్ఎన్.రెడ్డి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ పాలాస రాంకిరణ్, సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ రాజేశం, స్టేట్ కౌన్సిల్ మెంబర్‌గా డాక్టర్ ఆలీం గెలుపొందారు. రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన ఐదుగురికి చోటు తగ్గడంపై జిల్లా ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు నరేశ్, నవీన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

‘జ్యోతిష్మతి’లో ఎన్‌సీసీ యూనిట్


మాట్లాడుతున్న కల్నల్ డేనియల్


ఎన్ సీసీ విద్యార్థులతో మాట్లాడుతున్న డేనియల్

తిమ్మాపూర్(మానకొండూర్): ఎన్‌సీసీ(నేషనల్ కెడెట్ కాప్స్) ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫామ్ యువజన సంస్థ అని 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి కల్నల్ డేనియల్ లోడ్జమ్ అన్నారు. మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (అటానమస్)కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం డేనియల్ మాట్లాడుతూ... 1948లో 20వేల మందితో ప్రారంభం కాగా ప్రస్తుతం 40 లక్షల మంది ఉన్నారని, క్రమశిక్షణ, నాయకత్వం, సేవా భావంతో కూడిన భావి నాయకులను తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ అంకితభావంతో పనిచేస్తుందన్నారు. కాలేజీలో ఎన్‌సీసీ యూనిట్ ఏర్పాటు విద్యార్థుల అదృష్టమని పేర్కొన్నారు. జిట్స్‌లోని ఎన్‌సీసీ యూనిట్‌లో రిటైర్డ్ ఆర్మీ అధికారితో పాటు తొమ్మిది తెలంగాణ బెటాలియన్‌లోని పీఐ సిబ్బంది క్యాడెట్‌లకు అవసరమైన మార్గ నిర్దేశం చేస్తారని వివరించారు. విద్యార్థులు ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్ పరీక్షలు, బెటాలియన్‌లో నిర్వహించే వార్షిక సంయుక్త శిక్షణ శిబిరానికి హాజరు కావాలన్నారు. 85 శాతం అంతకంటే ఎక్కువ మార్కులతో అకాడమిక్స్ పరీక్షల్లో రాణిస్తున్న క్యాడెట్లకు సీడబ్ల్యూఎస్(క్యాడెట్ వెల్ఫేర్ స్కాలర్‌షిప్) లభిస్తుంద, సాయుధ దళాలల్లో చేరడానికి, ప్రభుత్వ ఉద్యోగాలు పొందడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రెటరీ, కరస్పాండెంట్ జె. సుమిత్‌సాయి, ప్రిన్సిపల్ డాక్టర్ కేఎస్ రావు, మేజర్ సాగర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల కలెక్టరేట్ సెక్షన్ అధికారి సస్పెన్షన్


నరేశ్, కలెక్టరేట్ సెక్షన్ అధికారి

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో సెక్షన్ అధికారి దర్పల్లి నరేశ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశాలు జారీ చేశారు. నరేశ్ చందుర్తి తహసీల్దార్‌గా 2018 నుంచి 2022 వరకు పనిచేసి బోయినపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. చందుర్తి తహసీల్దార్‌గా పనిచేసిన కాలంలో నరేశ్ అనంతపల్లికు చెందిన రైతు భూమిని తప్పుడు పత్రాలతో మరో రైతు పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు పోలీస్ కేసు నమోదైంది. అప్పటికే నరేశ్‌ను బోయినపల్లి నుంచి కలెక్టరేట్‌లో ఐ–సెక్షన్ ఇన్‌చార్జీగా బదిలీ చేశారు. చందుర్తి పోలీసులు పూర్తి వివరాలు సేకరించి తప్పుడు భూమిపత్రాలను అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారిస్తూ నరేశ్‌ను చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. కలెక్టరేట్‌లోని ఐ–సెక్షన్ ఇన్‌చార్జీగా పనిచేస్తుండగా నరేశ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నరేశ్ అరెస్టయిన నేపథ్యంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. చందుర్తి మండలంలో జరిగిన రెవెన్యూ భూఅక్రమాలపై ‘సాక్షి’ వరుస కథనాలను ప్రచురించింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్‌గా పనిచేసిన నరేశ్ అరెస్ట్ కావడం, ఆయన సస్పెన్షన్‌కు గురికావడం గమనార్హం.

చచ్చిపోతానంటూ వీడియోకాల్

- భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్యాయత్నం
- రక్షించిన పోలీసులు


సత్యంకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): భార్యతో గొడవపడి అలిగివెళ్లిన భర్త.. క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. సకాలంలో స్పందించిన పోలీసులు అతడిని రక్షించారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం మొర్రాయిపల్లెకు చెందిన యువతితో ఎల్లారెడ్డిపేటకు చెందిన సత్యంకు వివాహమైంది. సత్యం మొర్రాయిపల్లెకు ఇల్లరికం వెళ్లాడు. కొద్ది రోజులుగా భార్యతో గొడవ పడుతున్నాడు. సోమవారం కూడా భార్యతో గొడవపడ్డ సత్యం.. గ్రామ శివారులోని పంట పొలాలకు వెళ్లి, చేతిలో పురుగుల మందు డబ్బాతో చనిపోతున్నానంటూ భార్యకు వీడియోకాల్ చేశాడు. దీంతో ఆమె పురుగుల మందు తాగొద్దంటూ వేడుకుంది. అయినా సత్యం వినిపించుకోకపోవడంతో, 100కు డయల్ చేసింది. వెంటనే ఎస్సై గణేశ్, సత్యం ఉన్న చోటు సెల్‌ఫోన్ లోకేషన్ తెలుసుకుని బ్లూకోల్ట్స్ సిబ్బంది చంద్రశేఖర్, నర్సింలుకు సమాచారం అందించారు. వారు మొర్రాయిపల్లె పంట చేనులో ఉన్న సత్యం వద్దకు చేరుకున్నారు. అతని చేతిలో ఉన్న పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకుని, ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సత్యం, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. సకాలంలో 100 డయల్ చేయడంతో సత్యం ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నామని ఎస్సై వివరించారు.

అమ్మా అంటూ పలకరించి.. బంగారం అపహరించి..

- వృద్ధురాలి మెడలోంచి రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన అగంతకుడు
- జమ్మికుంట పట్టణంలో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు


బాధిత వృద్ధురాలు చంద్రకళ

జమ్మికుంట: దారివెంట వెళ్తున్న వృద్ధురాలిని ఓ గుర్తుతెలియని వ్యక్తి అమ్మా బాగున్నావా అంటూ పరిచయం చేసుకున్నాడు. పింఛన్ వస్తుందా అంటూ ఆరా తీశాడు. ఈ రోజే బ్యాంక్‌లో ఫొటో దిగి ఇవ్వాలంటూ, ఫొటో దిగేప్పుడు బంగారం ఒంటిపై ఉండొద్దని సినీఫక్కీలో రెండున్నర తులాల బంగారు గొలుసు అపహరించిన ఘటన జమ్మికుంటలో చోటు చేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సూదం చంద్రకళ సమీపంలోని శివాలయానికి వెళ్లింది. తిరిగొస్తుండగా.. ఓ అగంతకుడు బాగున్నావా అంటూ పరిచయం చేసుకున్నాడు. నువ్వు పింఛన్ తీసుకోలేదు. అందుకోసం బ్యాంక్‌లో నీ ఫొటో ఇవ్వాలని నమ్మించాడు. ఈ రోజే చివరి రోజు అని కొండూరు కాంప్లెక్స్‌లోని ఓ ఆస్పత్రి సమీపంలోకి తీసుకెళ్లాడు. ఫొటోలో బంగారం పడకుండా తీయాలన్నాడు. బంగారు గొలుసు తీసుకుని అక్కడినుంచి పరారయ్యాడు. మోసపోయానని గ్రహించిన వృద్ధురాలు రోదిస్తూ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. గొలుసు రెండున్నర తులాల ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మారని విద్యాశాఖ తీరు

- తాజాగా ఏడుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్


డీఈవో కార్యాలయం

కరీంనగర్: పిల్లలకు పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు అడ్డదారుల్లో నడుస్తున్నారు. అక్రమ ఆదాయంపైనే దృష్టి పెడుతున్నారు. కొంత మంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ ధనార్జనే ధ్యేయంగా విధులకు ఎగనామం పెడుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతోంది. బదిలీలు, పదోన్నతులు, కౌన్సెలింగ్ జరిగినప్పుడల్లా మెరిట్‌లిస్టుల్లో అదనపు పాయింట్ల కోసం అడ్డదారులు తొక్కడం రివాజుగా మారింది. స్పౌజ్ కేటగిరీ పాయింట్లతో పాటు లేని రోగాలు ఉన్నట్లుగా సర్టిఫికెట్లు అందజేయడం, ఇంక్రిమెంట్ల కోసం అడ్డదారులు తొక్కడం నిత్యకృత్యమైంది. ఇటీవలి కౌన్సెలింగ్, బదిలీలు, పదోన్నతుల సమయంలో భార్యభర్తలు ప్రభుత్వ ఉద్యోగులైతే స్పౌజ్ కేటగిరీ పాయింట్లను వాడుకుని నిబంధనల మేరకు బదిలీ స్థానాలను సూచించాలన్నది నిబంధన. అందుకు భిన్నంగా భార్యాభర్తలు ఒక్కచోటికి, సమీప ప్రాంతం పాఠశాలకు పోస్టింగ్ కోసం కాకుండా పట్టణ కేంద్రాలకు దగ్గరగా, హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాలకు వెళ్లేందుకు కౌన్సెలింగ్ సమయంలో అదనపు పాయింట్లు సమర్పించి దరఖాస్తులు చేసుకోవడం ద్వారా స్పౌజ్ కేటగిరీ పాయింట్లు దుర్వినియోగం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు రావడంతో ఎంఈవోలతో విచారణ చేపట్టి 17 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తాజాగా ఆదివారం ఏడుగురు ఉపాధ్యాయులను సస్పెండ్‌చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేయడం విద్యాశాఖలో కలకలం రేపింది. స్పౌజ్ పాయింట్లను దుర్వినియోగం చేసిన మరికొందరి టీచర్లపై పూర్తి స్థాయి విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు జిల్లావిద్యాశాఖ అధికారులు సిద్ధమైనట్లు సమాచారం.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

కరీంనగర్: రాష్ట్రంలో విద్యార్థులకు అందించాల్సిన రూ.6,350కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ‘చలో కలెక్టరేట్’ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంగిడి కుమార్, ముల్కల మారుతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తుండగా విద్యారంగంపై సరైన నిర్ణయాలు చేయడం లేదన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందన్నారు. కొన్ని ఇంటర్, డిగ్రీ ఇంజినీరింగ్ కళాశాలలు మూసివేసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వెంటనే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. పీడీఎస్‌యూ సహాయ కార్యదర్శి రాజశేఖర్, జిల్లా నాయకులు అంజనిప్రసాద్, అరవింద్, చరణ్, పవన్, శేఖర్, అరుణ్, సాయి, సాగర్‌వినయ్, జ్యోతి, శ్రుతి, శ్రావణి, అంజలి పాల్గొన్నారు.

ఐపీతో కుచ్చుటోపీ

- దివాళా పేరుతో కోర్టు నోటీసులు
- లబోదిబోమంటున్న ప్రజలు
- కొత్తగా అప్పు పుట్టక ఇబ్బందులు

మెట్‌పల్లి: ‘మెట్‌పల్లి పట్టణంలోని వెలుల్ల రోడ్‌కు చెందిన కిరాణంషాపుల వ్యాపారుల కుటుంబం దివాళా తీసినట్లు కోర్టును ఆశ్రయించింది. అప్పు ఇచ్చిన వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరింది. వీరి పిటీషన్‌ను పరిశీలించిన కోర్టు.. వారికి అప్పు ఇచ్చిన 34మందికి ఐపీ నోటీసులు జారీ చేసింది.’

‘మెట్‌పల్లిలోని చావిడి రోడ్‌లో పేరొందిన జువెల్లర్స్ వ్యాపారి కూడా ఇలాగే కోర్టులో పిటిషన్ వేశాడు. వ్యాపారంలో దివాళా తీయడంతో రూ.కోటికి పైగా ఉన్న అప్పు చెల్లించలేనని తెలిపి.. 28మందికి కోర్టు ద్వారా ఐపీ నోటీసులు పంపాడు.’

మెట్‌పల్లి పట్టణంలో పలువురు వ్యాపారులు దివాళా పేరుతో కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపుతుండడం కలకలం రేపుతోంది. తాము నిర్వహిస్తున్న వ్యాపారాలను చూపుతూ అందినకాడికి అప్పు చేయడం, చిట్టీల ద్వారా పెద్ద ఎత్తున డబ్బు సేకరించడం చేస్తున్నారు. ఆ తర్వాత దివాళా తీశామని కోర్టు తలుపులు తట్టడం.. అప్పు, చిట్టీలు ఇచ్చిన వారికి ఐపీలు పంపి టోపీలు పెట్టడం వంటివి ఇటీవల ఎక్కువగా జరుగుతున్నాయి. చట్టం కల్పించిన అవకాశాన్ని అసరాగా చేసుకొని కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి చర్యలతో ప్రస్తుతం మార్కెట్‌లో కొత్తగా అప్పు పుట్టడం కష్టంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఐపీ అంటే..

- ఐపీ అంటే ఇన్‌సాల్వెన్సీ పిటిషన్. వ్యాపారంలో దివాళా తీసినప్పుడు రుణ గ్రహీతలకు రక్షణ కల్పించడానికి రూపొందించిన చట్టమిది.
- వ్యాపారంలో నష్టాలు వచ్చి అప్పు తీర్చడం కష్టమైనప్పుడు కోర్టును ఆశ్రయించే అవకాశముంటుంది.
- తనకున్న అప్పుతోపాటు ఆస్తుల వివరాలను కోర్టుకు సమర్పించి.. దివాళా తీయడానికి కారణాలను వివరించి కోర్టు ద్వారా రక్షణ పొందే వెసులుబాటును ఈ చట్టం కల్పిస్తోంది.

నమ్మించి ముంచుతున్నారు...

- చట్టాన్ని ఆసరాగా చేసుకొని కొందరు అప్పులు, చిట్టీలు ఇచ్చిన వారిని మోసాలకు గురి చేస్తున్నారు.
- వ్యాపారంలో పెట్టుబడి పేరుతో వడ్డీ, చిట్టీల వ్యాపారుల వద్ద రూ.లక్షలు, రూ.కోట్లల్లో సొమ్మును సేకరిస్తున్నారు.
- ఆ సొమ్మును కొందరు తమ జల్సాల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేయడం, షేర్ మార్కెట్ వంటి వాటిల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం వంటివి చేస్తూ నష్టపోతున్నారు.
- మరికొందరు వ్యాపారాలు సక్రమంగా నడవకపోవడంతో తెచ్చిన అప్పు వడ్డీలు కట్టలేక, చిట్టీల నెలవారీ కిస్తులు చెల్లించలేక దివాళా తీస్తున్నారు.
- చివరకు రుణాలు, చిట్టీలు ఇచ్చిన వారి ఒత్తిళ్లు తట్టుకోలేక కోర్టులను ఆశ్రయిస్తూ రక్షణ పొందుతున్నారు.

అప్పు పుట్టడం కష్టంగా మారిన వైనం

- ఇటీవల స్థానికంగా పేరొందిన ఓ బంగారం వ్యాపారి ఊహించని విధంగా ఐపీ పెట్టారు. అలాగే కిరాణషాపులు నడిపే వ్యాపారులు కూడా ఐపీ నోటీసులు పంపారు.



- అంతకు ముందు కొందరు పెద్ద ఎత్తున అప్పు చేసి గుట్టు చప్పుడు కాకుండా ఊరు నుంచి వెళ్లిపోయారు.
- ఇవే కాకుండా మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల వల్ల చాలా మంది తీసుకున్న అప్పులు, చిట్టీల కిస్తులు కట్టడానికి ముప్పుతిప్పలు పెడుతున్నారు.
- వీటివల్ల వడ్డీ, చిట్టీల వ్యాపారం చేసే వారిలో పలువురికి భారీగా నష్టం జరిగింది. వీటిని దృష్టిలో పెట్టుకొని చాలామంది ఈ దందాలను మానుకుంటున్నారు. కొత్తగా అప్పులు, చిట్టీలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు.
- వాస్తవానికి అధిక శాతం వ్యాపారాలు వడ్డీ, చిట్టీల మీదనే ఆధారపడి నడుస్తున్నాయి.
- కొందరి తీరు వల్ల ప్రస్తుతం మెట్‌పల్లి మార్కెట్‌లో అప్పులు, చిట్టీలు దొరకని పరిస్థితి తలెత్తడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.



శంభోశంకర

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. రాజన్నను సుమారుగా 49వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

